క్లుప్తంగా

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం



తిమ్మాపూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో రాజ్‌కుమార్

ఇబ్రహీంపట్నం: ఆయిల్‌పామ్ పంట సాగు చేస్తే లాభదాయకంగా ఉంటుందని మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ అన్నారు. గురువారం మూలరాంపూర్, తిమ్మాపూర్ గ్రామాల్లో రైతులతో సమావేశం నిర్వహించి ఆయిల్‌పామ్ పంట సాగుపై అవగాహన కలి్పంచారు. ఏఈవోలు సాగర్, రవళిక, కంపెనీ ప్రతినిధి అక్షయ్ పాల్గొన్నారు.

పంట కోతకు వచ్చిన తర్వాతే ప్రారంభించాలి

మల్యాల: వరి పంట పూర్తిగా కోతకు వచ్చిన తర్వాతే వరి కోతలు ప్రారంభించాలని మండల వ్యవసాయాధికారి కె.చంద్రదీపక్ అన్నారు. ముత్యంపేట గ్రామంలో క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు రైతు దానవేని మహేశ్ వరి పొలాన్ని సందర్శించారు. వరి పొలం పూర్తిగా పక్వానికి వచ్చి ఎండిన తర్వాతే వరి కోతలు చేపట్టాలని సూచించారు. ఏఈవో మంజుల, ఎస్.కారుణ్యకుమార్, కె.శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపునకు సహకరించాలి

మెట్‌పల్లి: ఆటో స్టార్టర్ల వినియోగంతో విద్యుత్, నీరు వృథా అవుతోందని, దీనిని అరికట్టేందుకు రైతులు సహకరించాలని ఏడీఈ మనోహర్ గురువారం కోరారు. మెట్‌పల్లి, మల్లాపూర్ సబ్ డివిజన్లలో 32వేల విద్యుత్ కనెక్షన్లున్నాయని, వీటికి ప్రతిరోజు 11.22లక్షల యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా జరుగుతోందన్నారు. వేసవిలో విద్యుత్ వాడకం గణనీయంగా పెరిగినందున రైతులు అవసరమున్నంత మేరకే నీటిని వినియోగించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయికల్: బోర్నపల్లి మురళీధర గోధామంలో ఈనెల 12, 13ల్లో పంచగవ్య ప్రొడక్ట్స్, 18 నుంచి 20 వరకు ఫైవ్ లేయర్ మోడల్, ఫుడ్ ఫారెస్ట్ మల్టీ క్రాపింగ్, 21 నుంచి 28 వరకు సోలార్ ఎనర్జీ బల్బుల తయారీ, 30 నుంచి మే 7 వరకు మట్టిల్లు నిర్మాణం వంటి స్వయం ఉపాధి కోర్సుల్లో నిర్ణీత రుసుముతో శిక్షణ అందిస్తున్నట్లు మురళీధర గోధామం నిర్వాహకురాలు డాక్టర్ పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్, శిక్షణ వివరాలకు 9849750854 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేత్ర వైద్య సదస్సులో ఎమ్మెల్యే



జగిత్యాల: న్యూఢిల్లీలోని యశోభూమిలో జరుగుతున్న ఆసియా పసిఫిక్ నేత్ర వైద్యుల సదస్సులో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఏప్రిల్ 3, 4, 5, 6ల్లో జరగనున్న ఈ సదస్సులో మూడు రోజులపాటు పాల్గొననున్నారు. కోరుట్లకు చెందిన నేత్ర వైద్య నిపుణులు సంపత్, విజయ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ముత్తూట్ లోన్స్ కార్యాలయంలో కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఉద్యోగులు, సిబ్బంది, కస్టమర్లకు వైద్య సేవలందించారు. వైద్యులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి వైద్య సేవలందించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. నిర్వాహకులు కరుణాకర్, సాయితేజ పాల్గొన్నారు.

క్లబ్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం



జగిత్యాల: జగిత్యాల రిక్రియేషన్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నికలు ఇటీవల జరగగా.. గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. జగిత్యాల క్లబ్ కార్యదర్శిగా ముస్కు రాంగోపాల్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా హేమేందర్‌రెడ్డి, కోశాధికారిగా అనుమండ్ల వెంకటరమణ, క్రీడల కార్యదర్శిగా అమిత్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా బూస తిరుపతి, కూసరి అనిల్, నారాయణరెడ్డి, ఎడ్మల శ్రీనివాస్‌రెడ్డి, సంజయ్, సామ్రాట్, సాయికృష్ణ, పుష్ప, అంజిబాబు ప్రమాణ స్వీకారం చేశారు.

పల్లె దారులకు మహర్దశ

- సీసీ రోడ్లుగా మారుతున్న వీధులు
- చురుగ్గా సాగుతున్న నిర్మాణ పనులు



దీకొండలో మైసమ్మ ఆలయం వద్ద ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు

పెగడపల్లి: ధర్మపురి నియోజకవర్గంలోని పల్లె రోడ్లకు మహర్దశ పట్టుకుంది. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో పలు గ్రామాల్లోని మట్టి రోడ్లు సీసీ రోడ్లుగా మారుతున్నాయి. వీటితోపాటు మురుగు కాల్వల నిర్మాణాలు చేపట్టారు. గ్రామాల్లో దాదాపు మట్టి రోడ్లు త్వరలో కనుమరుగు కానున్నాయి. అంతర్గత వీధులు అస్తవ్యస్తంగా ఉండి అవస్థలు పడుతున్న పల్లెవాసులు సీసీ రోడ్లు నిర్మిస్తుండటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ధర్మపురి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో గతేడాది రూ.7.05కోట్లతో పనులు జరగగా.. ఈ ఏడాది రూ.15కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిని సీసీ రోడ్లు, మురుగు కాల్వలు నిర్మించేందుకు వినియోగిస్తున్నారు. గతంలో గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయిస్తున్న కొద్దిపాటి నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు అంతంతమాత్రంగానే జరిగేవి. ఉపాధి హామీ నిధుల పుణ్యమాని ప్రస్తుతం ఆ పరిస్థితులు దూరమవుతున్నాయి.

నిధుల మంజూరిలా..

నియోజకవర్గంలోని ధర్మపురి, పెగడపల్లి, గొల్లపల్లి, ధర్మారం, వెల్గటూర్, బుగ్గారం మండలాల్లో 140 గ్రామ పంచాయతీలున్నాయి. దాదాపు అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు వేసేందుకు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రతిపాదనల మేరకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయి. వీటికి సంబంధించి అధికారులు గ్రామాల్లో సర్వే నిర్వహించి పలు ప్రాంతాల్లో సీసీ రహదారులు అవసరమని గుర్తించారు. ఇందుకోసం మండలాలవారీగా పెగడపల్లిలో 22 ప్రాంతాలను గుర్తించి రూ.2.45కోట్లు, వెల్గటూర్‌లో 29 ప్రాంతాలను గుర్తించి రూ.1.64కోట్లు, ధర్మపురిలో 33 ప్రాంతాలను గుర్తించి రూ.2.90కోట్లు, గొల్లపల్లిలో 31 ప్రాంతాలను గుర్తించి రూ.2.60కోట్లు, బుగ్గారంలో 22 ప్రాంతాల్లో రూ.2కోట్లు, ధర్మారంలో 30 ప్రాంతాలను గుర్తించి రూ.2కోట్లు మంజూరు చేసింది. మొత్తమ్మీద నియోజకవర్గంలో రూ.15కోట్లు విప్ అడ్లూరి ప్రతిపాదనల మేరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కొద్ది రోజులుగా ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి



గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లు మెరుగుపరిచేందుకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పిస్తున్నాం. ప్రత్యేక ప్రణాళికతో ప్రభుత్వం నుంచి భారీగా నిధులు రాబట్టి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు నిధులు కేటాయించాం. ప్రధానంగా సీసీ రోడ్లు, జీపీ, అంగన్‌వాడీ భవనాలు, మురుగు కాలువల నిర్మాణాలతోపాటు మౌలిక వసతులు కల్పిస్తున్నాం. విప్‌గా సీఎం సహకారంతో రానున్న రోజుల్లో అభివృద్ధిలో ధర్మపురి నియోజకవర్గం రూపురేఖలు మార్చేందుకు తనవంతు కృషి చేస్తా.

– అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్



సారంగాపూర్: బీర్‌పూర్ మండలం చిన్న కొల్వాయి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల భవనం గ్రామ ప్రధాన రహదారిని ఆనుకొని ఉంది. పాఠశాలకు ప్రహరీ నిర్మాణం జరగకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోకి వచ్చే ప్రధాన రహదారిని ఆనుకొని ఉండడంతో ప్రమాదం పొంచి ఉంది. ప్రహరీ నిర్మాణం జరగకపోవడంతో పశువులు, కుక్కలు పాఠశాల ఆవరణలోకి వస్తున్నాయి. అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సిరుప నాగభూషణం, మండల విద్యాధికారి, బీర్‌పూర్, సెల్ నం.: 9490222042

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

సన్నబియ్యం పంపిణీ ప్రారంభం



మల్యాల: బియ్యం పంపిణీ ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోరుట్ల/కోరుట్ల రూరల్: పట్టణంలోని 16వ వార్డు, గుమ్లాపూర్, సంగెం గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని గురువారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు మాట్లాడారు. మండల అధ్యక్షుడు కొంతం రాజం, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్‌గౌడ్, సీనియర్ నాయకులు సత్యంరావు, బలిజ రాజరెడ్డి, కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

మల్యాల: మండల కేంద్రంతోపాటు రామన్నపేటలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు గురువారం కాంగ్రెస్ నాయకులు రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. మార్కెట్ యార్డు డైరెక్టర్ ముదాం మల్లేశం, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శనిగరపు తిరుపతి, వీరబత్తిని ప్రసాద్, ఎన్ఎస్‌యూఐ మండలాధ్యక్షుడు కోరెపు వేంకటేశ్, ఎండీ ఇమామ్, గడి అనిల్, కొట్టిపల్లి బాబు, నేరెళ్ల సతీశ్‌రెడ్డి, ఎండీ వలీ, తిపిరెడ్డి కిషన్‌రెడ్డి, తుమ్మన్నపల్లి సత్యం పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: వేములకుర్తి గ్రామంలో రేషన్ దుకాణాల్లో గురువారం సన్నబియ్యం పంపిణీని కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. పెంట లింబాద్రి, వెంకటాద్రి, తరి రామనుజం, గుమ్మల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: రేషన్ దుకాణాల్లో గరీబ్ కల్యాణ్ పథకం అన్న యోజన పథకం ద్వారా పేదలకు సన్నబియ్యం అందించేది కేంద్ర ప్రభుత్వమేనని బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రేషన్ దుకాణాన్ని బీజేపీ నాయకులతో కలిసి సందర్శించి పేదలకు సన్న బియ్యాన్ని పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మి, మండల ఉపాధ్యక్షుడు లవంగ శివకుమార్, నాయకులు మొరపు జలపతి, గడ్డం నర్సరెడ్డి, డబ్బా రాజారాం తదితరులు పాల్గొన్నారు.



మెట్‌పల్లిరూరల్: నినాదాలు చేస్తున్న గ్రామస్తులు

దొడ్డి కొమురయ్యకు నివాళి

కోరుట్లటౌన్: పట్టణంలోని సి.ప్రభాకర్ భవన్‌లో దొడ్డి కొమురయ్య జయంతి సభ గురువారం జరిగింది. దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలదండలు వేసి నివాళి తెలిపారు. కొమురయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ నాయకులు చెన్న విశ్వనాథం, సుతారి రాములు అన్నారు. సి.ప్రభాకర్ స్మారక గ్రంథాలయం అధ్యక్షుడు రాస భూమయ్య, వృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాచకొండ పెద్ద దేవయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు చింత భూమేశ్వర్, నాయకులు గంగాధర్, రాడం అశోక్, లక్ష్మీనారాయణ, మహేశ్, కొక్కుల గంగాధర్, వంశీకృష్ణ, తుకారాం, రాంబాబు పాల్గొన్నారు.

మెట్‌పల్లిరూరల్: ఆత్మకూర్ గ్రామంలో దొడ్డి కొమురయ్య విగ్రహం ఆవిష్కరించారు. కురుమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ విగ్రహ ఆవిష్కరణకు గురువారం పలువురు హాజరయ్యారు. కురుమ కుల చరిత్ర అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కురుమ సంఘ సభ్యులు, పలు పార్టీలకు చెందిన నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: దొడ్డి కొమురయ్య జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ కోరారు. పట్టణంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో గురువారం కొమురయ్య జయంతి వేడుకలను నిర్వహించారు. కోట రమేశ్, నడ్పిసాయన్న, కోరె గంగాధర్, గడ్డం మల్లేశ్, కోట శ్రీనివాస్ తదితరులున్నారు.

పోతారం అటవీ ప్రాంతం పరిశీలన



అటవీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎఫ్‌వో

కథలాపూర్: పోతారం గ్రామ శివారులోని అటవీ ప్రాంతాన్ని డీఎఫ్‌వో రవిప్రసాద్ గురువారం పరిశీలించారు. ఎవరైనా చెట్ల తొలగింపు, చదును చేశారా అని పలు ప్రాంతాల్లో తనిఖీ చేశారు. అంబారిపేట గ్రామ శివారులో అటవీ శాఖ క్యాంపు కార్యాలయాన్ని తనిఖీ చేసి సిబ్బందిని వివరాలడిగి తెలుసుకున్నారు. మెట్‌పల్లి ఎఫ్ఆర్‌వో షౌకత్‌అలీ, అటవీ శాఖ సెక్షన్, బీట్ ఆఫీసర్లున్నారు.

ఇంటి పన్నులు చెల్లించండి



రాయికల్: పన్ను చెల్లిస్తున్న చెరుకు పార్వతి

రాయికల్: ఏప్రిల్ 30 వరకు ఇంటి పన్ను చెల్లింపు చేసేవారికి ఐదు శాతం రాయితీని ప్రభుత్వం కల్పిస్తోందని రాయికల్ మున్సిపల్ కమిషనర్ టి.మనోహర్ తెలిపారు. గురువారం పట్టణంలోని పన్ను వసూలును పరిశీలించారు. మున్సిపల్ మేనేజర్ వెంకటి, ఆర్ఐ అశోక్, బిల్ కలెక్టర్లు మందుల ప్రసాద్, దుబ్బ రాజ్‌కుమార్, బి.నరేశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ

కోరుట్లటౌన్: 2025–26 ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ ఉంటుందని మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ గురువారం పేర్కొన్నారు. ఈనెల 30 వరకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని వివరించారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కేంద్ర మంత్రికి లేఖ

జగిత్యాల: జగిత్యాల–కరీంనగర్ నేషనల్ హైవే విస్తరణ పనులు వెంటనే చేపట్టాలని 35వ వార్డు మాజీ కౌన్సిలర్ అనుమల్ల జయశ్రీ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి లేఖ రాశారు. 2014లో జగిత్యాల, కరీంనగర్ పట్టణాన్ని కలుపుతూ రోడ్డును ఏర్పాటు చేద్దామని నిర్ణయించినా.. అప్పుడు అధికారులు పట్టించుకోకపోవడంతో అలాగే మిగిలిపోయిందన్నారు. మూడోసారి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బాధ్యతలు తీసుకున్న 100 రోజుల్లో ప్రణాళికల్లో భాగంగా చేపట్టాలన్నారు.

స్పాట్ రెమ్యునరేషన్ త్వరగా చెల్లించాలి

జగిత్యాల: స్పాట్ రెమ్యునరేషన్ త్వరగా చెల్లించాలని గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ 475 ఆధ్వర్యంలో ఇంటర్‌బోర్డు పరిశీలకుడు వెంకటేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. 2023–24లో వార్షిక పరీక్షల విధుల్లో పాల్గొన్న అధ్యాపకులకు ఇప్పటివరకు రెమ్యునరేషన్ రాలేదన్నారు. ఇంటర్ బోర్డు నిబంధనల ప్రకారం అసిస్టెంట్ ఎగ్జామినర్ రోజుకు 30 జవాబుపత్రాలు మూల్యాంకనం చేయాల్సి ఉండగా కొన్ని కేంద్రాల్లో అదనంగా 10 పేపర్లు చేయిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొట్టాల తిరుపతిరెడ్డి, అత్తినేని శ్రీనివాస్, జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీహరి, సంతోష్ పాల్గొన్నారు.

నైపుణ్యం, మేధాశక్తి వెలికితీసేందుకే ప్రతిభ వేదిక



ప్రతిభ వేదిక ప్రారంభిస్తున్న డీఈవో రాము

జగిత్యాలరూరల్: విద్యార్థుల్లో నైపుణ్యం, మేధాశక్తి వెలికితీసేందుకు ప్రతిభ వేదిక ఎంతో దోహదపడుతుందని డీఈవో రాము అన్నారు. గురువారం జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామ శివారులోని సూర్య గ్లోబల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ప్రతిభ వేదికను ప్రారంభించారు. విద్యార్థులు పోలీసు, డాక్టర్, ఉపాధ్యాయుడు, సైనికుడు, న్యాయమూర్తి, ఇంజనీర్, ఆర్మీ, సేఫ్ సెంటర్, రైతు, టైలర్, పోస్టాఫీసు, బ్యాంక్ వంటి వృత్తులకు అనుగుణంగా ముస్తాబైన వేషధారణల్లో ఆకట్టుకున్నారు. జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు, డైరెక్టర్లు మంజుల, రమాదేవి, హరిచరణ్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వార్షిక క్రీడల్లో ప్రతిభ



కోరుట్ల: పట్టణంలోని కోరుట్ల పబ్లిక్ స్కూల్‌లో గురువారం వార్షిక క్రీడలు నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు పతకాలు, సర్టిఫికెట్లు అందించారు. కేపీఎస్ కరస్పాండెంట్ గుజ్జేటి వెంకటేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అలరించిన వార్షిక వేడుకలు



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమం

రాయికల్: పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో విరించి–2025 వార్షిక వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ జూపల్లి వేణుగోపాలరావు మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. డైరెక్టర్ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకన భత్యమందేలా చూడాలి

జగిత్యాల: జిల్లాలో పదోతరగతి మూల్యాంకనానికి సంబంధించిన గౌరవ భత్యాలను రెండు సంవత్సరాలుగా ఇవ్వడం లేదని, అందేలా చూడాలని అడిషనల్ కలెక్టర్‌కు గురువారం తపస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య, ప్రసాద్‌రావు, నరేందర్‌రావు, ఒడ్నాల రాజశేఖర్, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

హెల్ప్ డెస్క్ ఏర్పాటు



దరఖాస్తు స్వీకరిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి

పెగడపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల స్వీకరణ కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తుల స్వీకరణ ఈనెల 14 వరకు ప్రభుత్వం పొడిగించిందన్నారు. పథకం సందేహాలు నివృత్తికి హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఎంపీవో మహేందర్, పీఆర్ ఏఈ శంషేరలీ, టైపిస్టు తిరుపతి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

నృసింహుడి సన్నిధిలో విద్యారణ్య భారతిస్వామి



ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మినృసింహస్వామి సన్నిధిలో గురువారం అనంతపూర్(ఆంధ్ర) విరూపాక్ష మఠం దత్తాత్రయ మహా సంస్థానం శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతిస్వామి స్వామివార్లను దర్శించుకున్నారు. ముందుగా స్వామీజీకి దేవస్థానం పక్షాన పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు జరిపారు. దేవస్థానం ఈవో శ్రీనివాస్, చైర్మన్ రవీందర్ స్వామివారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. ధర్మకర్తలు, ఆలయ అర్చకులు నంబి శ్రీనివాసచారి, నర్సింహమూర్తి, సిబ్బంది తదితరులున్నారు.

మల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు



రాఘవపేటలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

మల్లాపూర్: రాఘవపేటలో శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీమేడాలమ్మ, కేతమ్మ సహిత శ్రీమల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు గురువారం రెండోరోజు ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీమల్లికార్జునస్వామి ప్రతిష్ఠాపన ఉత్సవాలు 3 రోజులపాటు నిర్వహిస్తామన్నారు. గురువారం స్థాపిత దేవతార్చన, అగ్ని ప్రతిష్ఠ, నిత్య హోమం, గణపతి హోమం, రుద్ర హోమం, స్థాపిత దేవతా హోమాలు, షోడశ న్యాస హోమాలు, ద్వాదశ కలశస్నపనం, క్షీరాదివాస హోమం, నవకలశ స్నపనం, ఫలపుష్ప ధాన్యాధిశయ్యాదివాసం, ప్రాణప్రతిష్ఠ హోమం, కళాన్యాస హోమాలు, ప్రసాద వితరణ, 4న ఉదయం గతస్థాపిత దేవతార్చన, 9 గంటలకు యంత్రమూర్తుల ప్రతిష్ఠ, జయాధి హోమం, ప్రాయాశ్చిత హోమం, నేత్రోలినం, బలిహరణం, పూర్ణాహుతి, కుంబాభిషేకం, శాంతి కల్యాణం, తీర్థప్రసాద వితరణ, మహా అన్నదానంతో ఉత్సవాలు పూర్తవుతాయని దేశెట్టి భూమేశ్, ఎట్టం మల్లేశ్, అందుగుల భాస్కర్, మాదం రవి, బైరి రవికుమార్‌యాదవ్ తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. రాఘవపేట, నడికుడ గ్రామాల్లోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయాలను సందర్శించి పూజలు నిర్వహించారు. ముద్దం రాజేందర్‌రెడ్డి, నత్తి రాము, మాదం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమికి ముస్తాబైన ఆలయాలు



నంచర్ల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం

పెగడపల్లి: నామాపూర్, నంచర్ల, ఎల్లాపూర్, అయితిపల్లి, ల్యాగలమర్రి గ్రామాల్లోని ఆలయాలు శ్రీరామ నవమి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. ఆయా గ్రామాల్లో నాలుగు రోజులపాటు నిర్వహించే వేడుకలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యుద్దీపాలతో అలంకరించి రంగులద్దారు. ఈనెల 6న స్వామివారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరగనుంది.

బీఆర్ఎస్ సమావేశంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత



కేసీఆర్‌తో దావ వసంత

జగిత్యాలరూరల్: ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ రజతోత్సవ కార్యక్రమ నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించగా.. జగిత్యాల జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, సురేశ్ పాల్గొన్నారు.

విప్‌ను కలిసిన ఆర్టీసీ ఆర్ఎం, డీఎం



ధర్మపురి: ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఆర్టీసీ రీజనల్ మేనేజర్ రాజు, డిపో మేనేజర్ కల్పన మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.